# నేటి నుంచి ప్రచారంలో పాల్గొంటా..

● బెల్లంపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి, నవంబర్ 19: బెల్లంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో సోమవారం నుంచి పాల్గొంటానని బెల్లంపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం చిన్నయ్య తెలిపారు. చిన్నయ్యకు హైదరాబాద్ యశోద దవాఖానాలో ఆదివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. బెల్లంపల్లి మండలంలోని చాకేపల్లి గ్రామంలో మూడు రోజుల క్రితం ఎన్నికల ప్రచారంలో అస్వస్థతకు గురి కాగా బెల్లంపల్లి సింగరేణి ఏరియా దవాఖాన, మంచిర్యాలలోని ఓ ప్రవేట్ దవాఖానాలో చికిత్స పొందారు. వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు వెళ్లి రెండు రోజులుగా వైద్య చికిత్స చేయించుకుంటున్నారు. ప్రజలు, కార్యకర్తలు ధైర్యం కోల్పోవద్దని ఆయన కోరారు.


హైదరాబాద్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం చిన్నయ్యకు చికిత్స అందిస్తున్న డాక్టర్

# మూడో సారి చిన్నయ్యను ఆదరించండి

● ఎమ్మెల్యే సతీమణి దుర్గం జయతార


బెల్లంపల్లి : 21వ వార్డులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి జయతార, బీఆర్ఎస్ శ్రేణులు

బెల్లంపల్లి, నవంబర్ 19: నియోజకవర్గంలో మూడవసారి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం చిన్నయ్యను ఆదరించాలని ఎమ్మెల్యే సతీమణి దుర్గం జయతార కోరారు. ఆదివారం బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 21వ వార్డులో కౌన్సిలర్ బడికెల కమల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేతతో కలిసి మాట్లాడారు. ఇంటింటికీ తిరుగుతూ బీఆర్ఎస్ పథకాలను ఆమె ఓటర్లకు సమగ్రంగా వివరించారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోపై ప్రజలకు అవగాహన కల్పించారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్, బెల్లంపల్లి నియోజకవర్గంలో చిన్నయ్య గెలిస్తేనే సంక్షేమ, అభివృద్ధి పథకాలను కొనసాగుతాయని వివరించారు. డబ్బుల సంచులతో వచ్చేవాళ్లని నమ్మకుండా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి కష్ట,సుఖాలకు తోడుగా ఉండే మంచినాయకుడిని ఎంపిక చేసుకోవాలన్నారు. సంక్రాంత్రి పండుగకు గంగిరెద్దులవలె వచ్చే వారిని నమ్మి ఆగం కావద్దని సూచించారు. 2018 ఎన్నికల్లో ఓడినా, గెలిచినా స్థానికంగా ఉంటానని చెప్పినా గడ్డం వినోద్ ఎన్నికల ఫలితాల తెల్లవారే ఇక్కడి నుంచి ఉడాయించాడని గుర్తు చేశారు. మళ్లీ ఎన్నికల ముందు వస్తున్నాడని, డబ్బులతో మాయమాటలు చెప్పి జనాన్ని మోసం చేయడానికి వస్తున్న ఆయనను నమ్మే పరిస్థితిలో ఇక్కడి ప్రజలు లేరని తెలిపారు. స్థానికంగా లేకుండా ఎన్నికల సమయంలో మాత్రమే ఇక్కడికి వచ్చేవారికి ఓటు అడిగే అర్హత లేదని విమర్శించారు. ఎన్నికల వేళ మళ్లీ మోసగాళ్లు వస్తున్నారని, ప్రజలు వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. మహిళాభ్యున్నతికి సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు దేశానికి ఆదర్శమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో కేసీఆర్ మహిళల సంక్షేమం కోసం పెద్దపీట వేశారని గుర్తు చేశారు. మహిళలకు రూ. 3వేల ఆర్థిక సాయం చేయనున్నారని తెలిపారు. మూడు గంటల కాంగ్రెస్ కావాలా...24 గంటల బీఆర్ఎస్ పార్టీ కావాలా ? అని ప్రజలు ఆలోచించుకోవాలని సూచించారు. పేదల సంక్షేమ ధ్యేయంగా పది ఏండ్లుగా నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతున్న చిన్నయ్యకు మూడవ సారి ఓటు వేసి దుర్గం చిన్నయ్యను గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్, తెలంగాణ జాగృతి విభాగం రాష్ట్ర కో కన్వీనర్ సిద్ధం శెట్టి సాజన్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ వీ పట్టణ అధ్యక్షుడు సన్నీబాబు, నియోజకవర్గ అధ్యక్షుడు అన్వర్, నాయకులు బడికెల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్‌లో చేరికలు**

వేమనపల్లి, నవంబర్ 19 : మండలంలోని పలువురు కాంగ్రెస్ నాయకులు ఆదివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు తోకల వెంకటేశం, మైనార్టీ నాయకుడు సయ్యద్ సర్దార్, కాంగ్రెస్ నాయకులు రాజన్న, తిరుపతి, శేఖర్, మధుకర్, రాకేశ్, హరీశ్, సంతోష్, ప్రకాశ్, రామన్నతో పాటు 200 మంది బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోలి వేణు మాధవ్‌రావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్, నియోజకవర్గంలో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అభివృద్ధిని చూసి ఇతర పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారు బీఆర్ఎస్ అభ్యర్థి చిన్నయ్య గెలుపు కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పురాణం లక్ష్మీకాంత్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లింగాగౌడ్, సర్పంచు కుబిడె మధుకర్, పీఏసీఎస్ చైర్మన్ కుబిడె వెంకటేశం, నాయకులు వెంకటేశం, సంతోష్, సర్పంచు రాజలింగు తదితరులు పాల్గొన్నారు.

**సోమగూడెంలో ఇంటింటా ప్రచారం**

కాసిపేట,నవంబర్ 19: మండలంలోని సోమగూడెం గ్రామపంచాయతీలో సర్పంచ్ కొరికొప్పుల ప్రమీలాగౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య చేసిన అభివృద్ధిని, బీఆర్ఎస్ పథకాలను వివరించి బొట్టు పెట్టి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ స్థానికంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి చేసే బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం చిన్నయ్యకు మద్దతుగా కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రగిరి సంపత్, మునిమడుగుల రాజయ్య పాల్గొన్నారు.


వేమనపల్లి : బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న కోలి వేణుమాధవ్‌రావు


కాసిపేట : సోమగూడెంలో ప్రచారం నిర్వహిస్తున్న సర్పంచ్ ప్రమీలాగౌడ్, నాయకులు

## కోడి పందేలు ఆడుతున్న నలుగురి అరెస్ట్

కన్నెపల్లి, నవంబర్ 19 : మెట్‌పల్లి గ్రామశివారులో ఆదివారం కోడి పందేలు ఆడుతున్న వారిని పట్టుకున్నట్లు కన్నెపల్లి ఎస్ఐ నరేశ్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం గాదె అశోక్, ఒరగంటి రాజేందర్, పోర్తెట్టి మల్లేశ్, ఆత్రం శ్యాంసుందర్ కోడి పందాలు ఆడుతుండగా పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ. 2050 నగదు, కోళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కానిస్టేబుళ్లు మహేశ్, శ్రీనివాస్, హోంగార్డు రవి పాల్గొన్నారు. ముత్తాపూర్ ఎక్స్‌రోడ్డు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా దహెగాంకు చెందిన బుడుపల్లి అంజన్న మద్యం తరలిస్తుండగా 3.250 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

## అక్రమంగా విక్రయిస్తున్న మద్యం పట్టివేత

బెల్లంపల్లిరూరల్, నవంబర్ 19: బెల్లంపల్లి పట్టణంలోని పాతబస్టాండ్ ప్రాంతంలో ఆదివారం వాహనాల తనిఖీ చేస్తుండగా బుగ్గగూడెం గ్రామానికి చెందిన నల్లందుల రాకేశ్ (21) వద్ద రూ.4800 విలువ గల అక్రమ మద్యాన్ని పట్టుకున్నట్లు వన్‌టౌన్ సీఐ బన్సీలాల్ తెలిపారు. పట్టుబడ్డ రాకేశ్ తన ఇంట్లో కొంత కాలంగా బెల్ట్‌షాపు నిర్వహిస్తున్నట్లు అంగీకరించినట్లు తెలిపారు. పంచనామా నిర్వహించి రాకేశ్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో బెల్ట్‌షాపు నిర్వాహకులు అక్రమ మద్యం సరఫరా చేయడం గానీ, లైసెన్స్ లేకుండా అమ్మడం గానీ చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు పీడీ యాక్ట్ కూడా నమోదు చేస్తామని చెప్పారు.

## నేటి నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభం

బెల్లంపల్లి, నవంబర్ 19: బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నుంచి సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తున్నట్లు మార్కెట్ కార్యదర్శి భాస్కర్ తెలిపారు. తాండూర్ మండలం రేపల్లెవాడలోని మహేశ్వరి కాట్స్, శ్రీరామజిన్నింగ్ మిల్లులో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పత్తి మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 7020గా నిర్ణయించినట్లు వెల్లడించారు. కొనుగోళ్లని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## పేద యువతి వివాహానికి 'మేము సైతం' సాయం


నగదు, బియ్యం అందజేస్తున్న మేము సైతం సభ్యులు

మందమర్రి, నవంబర్ 19: మందమర్రి పట్టణంలోని అంగడిబజార్ సీఎస్‌పీ రోడ్డు కాలనీకి చెందిన నిరుపేద యువతి వివాహానికి మేము సైతం స్వచ్ఛంద సంస్థ సభ్యులు చేయూతనందించారు. అంగడిబజార్ కాలనీకి చెందిన రాంబాయిది నిరుపేద కుటుంబం ఆమె కూతురు గంగోత్రి వివాహం ఉండగా ఆర్థిక ఇబ్బందులను తెలుసుకుని మేము సైతం సభ్యులు సోషల్ మీడియా ద్వారా విరాళాలను సేకరించారు. దాతల సహకారంతో సేకరించిన రూ.11 వేలతో పాటు 25 కిలోల బియ్యాన్ని మేము సైతం సభ్యులు రాంబాయి ఆమె కూతురు గంగోత్రికి ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మేము సైతం అధ్యక్షుడు బుబత్తుల శ్రీనివాస్, సభ్యులు ఈర్లపాటి సోమయ్య, వడ్ల రవి, సారంగపాణి, వెల్డి సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బాల్క ఫౌండేషన్ చేయూత


మందమర్రిలో యువతికి నగదును అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మందమర్రి, నవంబర్ 19: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డు విద్యానగర్‌కు చెందిన నిరుపేద యువతి వివాహానికి బాల్క ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందించారు. యువతి వివాహం సోమవారం జరుగనుండగా వారి పరిస్థితిని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న బీఆర్ఎస్ చెన్నూర్ అభ్యర్థి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బాల్క సుమన్ వెంటనే స్పందించి బాల్క ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం చేశారు. ఆదివారం ఉదయం యువతి ఇంటికి వెళ్లిన బీఆర్ఎస్ నాయకులు 20 వేల రూపాయల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొంగల తిరుపతి రెడ్డి, రాగిడి రాంరెడ్డి, మహిళా నాయకురాలు ఎనగందుల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం


పద్మారావుకు నగదు అందజేస్తున్న యువకులు

లక్సెట్టిపేట, నవంబర్ 19: మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన మాలెం పద్మారావు సంవత్సర కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. బాధితుడు నిరుపేద కావడంతో వైద్య ఖర్చులకు డబ్బులు లేక ఇబ్బంది పడుతున్న సమయంలో అదే గ్రామానికి చెందిన బియ్యాల దినేశ్ తన వాట్సాప్ మిత్రులకు విషయం చేరవేశాడు. స్పందించిన యువకులు ఆదివారం సుమారు రూ.6వేలను పద్మారావుకు తన నివాసంలో అందించి మానవత్వం చాటారు. ఈ కార్యక్రమంలో యువకులు బియ్యాల మల్లేశ్, సాయి, లింగంపల్లి రవితేజ, నేరేళ్ల అంజి, తీర్థాల రాకేశ్, చుంచు సాయి, నల్కి భరత్, కోట రాము, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.